ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

బీబీపేట్, జనవరి 7: ఆన్‌లైన్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై అనిల్ సూచించారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇటీవల కాలంలో సైబర్ నేరాల సంఖ్య పెరిగిపోతున్నదని, గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేసి డెబిట్, క్రెడిట్ కార్డులను అప్‌డేట్ చేయాలని, బహుమతి వచ్చిందని ప్రాసెసింగ్ ఫీజ్ కోసం కొన్ని డబ్బులు పంపాలని అడుగుతారని, వారి మాటలు నమ్మవద్దని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలకు సంబంధించి లోన్లు మంజూరయ్యాయని, వివిధ రకాల యాప్‌లు డౌన్‌లోడ్ చేసుకోవాలని చెబుతారని, వాటిని ఇన్‌స్టాల్ చేసి వివరాలను నమోదు చేస్తే మీ బ్యాంకు ఖాతాలోని డబ్బులు సైబర్ నేరగాళ్ల ఖాతాలోకి వెళ్తాయని తెలిపారు. అపరిచిత వ్యక్తుల ఫోన్ కాల్స్‌తో అప్రమత్తంగాఉండాలని పేర్కొన్నారు. సైబర్ నేరాల బారినపడకుండా మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై సూచించారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ

దుప్పట్లను అందజేస్తున్న రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు

నస్రుల్లాబాద్, జనవరి 7: బీర్కూర్ మండల కేంద్రంలో రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సొసైటీ ప్రతినిధులు మాట్లాడుతూ..చలికాలాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామంలో 14 మంది నిరు పేదలకు దుప్పట్లను అందజేసినట్లు తెలిపారు. అధ్యక్షుడు విజయ్, సభ్యులు గంగాధర్ , మేకల విఠల్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ మాల మహానాడు సహాయ కార్యదర్శిగా గంగారాం

బాన్సువాడ, జనవరి 7 : మాల మహానాడు జాతీయ సహాయ కార్యదర్శిగా బాన్సువాడకు చెందిన సందుల గంగారాం ఎన్నికయ్యారు. ఆదివారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాల మహానాడు జాతీయ స్థాయి కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తన నియామకానికి సహకరించిన వారికి సందుల గంగారాం ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

నిలకడగా నిజాంసాగర్ నీటిమట్టం

నిజాంసాగర్, జనవరి 7: నిజాంసాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1405.00 అడుగుల (17.80 టీఎంసీల)కు గాను ఆదివారం 1401.97 అడుగుల (13.64 టీఎంసీల) నీరు నిల్వ ఉన్నదని ఏఈ శివకుమార్ ఆదివారం తెలిపారు. ప్రాజెక్టు కింద యాసంగి పంటల సాగు కోసం డిసెంబర్ 14 నుంచి ఈ నెల ఒకటో తేదీ వరకు ప్రధాన కాలువ ద్వారా 2.55 టీఎంసీల నీటిని విడుదల చేశామని చెప్పారు. ప్రాజెక్టు ఆయకట్టు కింద లక్షా 35వేల ఎకరాల్లో పంటలు సాగు అవుతున్నాయని తెలిపారు.

ఘనంగా అయోధ్య రాముడి అక్షింతల శోభాయాత్ర

నస్రుల్లాబాద్‌లో అక్షింతల శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

బాన్సువాడ రూరల్, జనవరి 7: మండలంలోని పోచారం, పోచారం తండా, రాంపూర్ తండాలో అయోధ్యరాముడి పూజిత అక్షింతల శోభాయాత్ర ఆదివారం వైభవంగా నిర్వహించారు. హన్మాన్ మందిరం నుంచి భజనలు చేస్తూ శోభాయాత్ర చేపట్టగా.. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. జై శ్రీరాం..జైజై శ్రీరాం అంటూ నినాదాలు చేశారు. గ్రామస్తులు సాయిరెడ్డి, విజయ్ గౌడ్, నరేశ్ గౌడ్, బలరాం తదితరులు పాల్గొన్నారు.

నస్రుల్లాబాద్‌లో..

నస్రుల్లాబాద్, జనవరి 7: నస్రుల్లాబాద్ మండల కేంద్రంలో ఆదివారం అయోధ్య రాముడి పూజిత అక్షింతల శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు. అనంతరం హనుమాన్, రామ మందిరాల వద్ద, ఇంటింటికీ అక్షింతలను పంపిణీ చేశారు. శోభాయాత్రలో భక్తులు భజనలు, కీర్తనలు చేశారు.

బస్వన్నపల్లిలో..

రాజంపేట్, జనవరి 7: అయోధ్య రాముడి పూజిత అక్షింతలు శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో మండలంలోని బస్వన్నపల్లికి శనివారం సాయంత్రం చేరుకోగా.. గ్రామస్తులు, మహిళలు మంగళహారతులతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అక్షింతలు,కలశాలతో శోభాయాత్ర నిర్వహించగా.. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. హనుమాన్ ఆలయంలో అక్షింతలను ఉంచి హనుమాన్ చాలీసా పారాయణం, రామనామ జపంచేసి ప్రతి ఇంటికీ అందజేస్తామని ట్రస్ట్ ప్రతినిధులు తెలిపారు. శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ సభ్యులు గుండాయల రాజిరెడ్డి, బాణాల మల్లారెడ్డి, పులేందర్ రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇంటింటికీ అక్షింతల పంపిణీ

ఎల్లారెడ్డి రూరల్, జనవరి 7: శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ సభ్యులు బృందాలుగా ఏర్పడి పట్టణంలోని పలు వార్డుల్లో అయోధ్య పూజిత అక్షింతలను ఇంటింటికీ అందజేశారు. అక్షింతలతోపాటు స్వామివారి చిత్ర పటాన్ని అందజేసి, అక్షింతలను ఎలా ఉపయోగించుకోవాలో వివరించారు.

మద్నూర్‌లో..

మద్నూర్, జనవరి 7: అయోధ్య పూజిత అక్షింతలను శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ బాధ్యులు మద్నూర్ మండల కేంద్రంలో ఆదివారం ఇంటింటికీ తిరుగుతూ అందజేశారు. అక్షింతలను శుభకార్యాల్లో ఉపయోగించుకోవచ్చని, భద్ర పరుచుకోవచ్చని వారు ప్రజలకు వివరించారు.

బస్వన్నపల్లిలో శ్రీరాముడి అక్షింతలకు మంగళహారతులో స్వాగతం పలుకుతున్న మహిళలు

మద్నూర్‌లో ఇంటింటికీ అక్షింతలు అందజేస్తున్న రాజస్థాన్ మార్వాడి సమాజ్ సభ్యులు

విద్యార్థుల తల్లిదండ్రులకు క్రికెట్ పోటీలు

బాన్సువాడ, జనవరి 7 : బాన్సువాడ డివిజన్ కేంద్రంలోని రిప్పల్స్ స్కూల్ యాజమాన్యం పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులకు ఆదివారం క్రికెట్ పోటీలను నిర్వహించింది. ఈ పోటీలను పట్టణ సీఐ మహేందర్‌రెడ్డి ప్రారంభించారు. విజేత జట్టుకు బహుమతులను అందజేశారు. ప్రిన్సిపాల్ యజ్ఞ, వైస్ ప్రిన్సిపాల్ మాయాదేవి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విజేత జట్టుకు బహుమతి అందజేస్తున్న అతిథులు

అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి

రాజంపేట్, జనవరి 7: మండలంలోని సిద్దాపూర్ గ్రామానికి చెందిన ఓ యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. సీఐ తిరుపయ్య తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కట్ల రాజు(30) శనివారం ఉదయం రెడ్డబోయిన భాస్కర్‌తో కలిసి ఎల్లాపూర్ తండా వాగువద్దకు చేపలు పట్టడానికి వెళ్లాడు. రాత్రయినా ఇంటికి రాకపోవడంతో తండ్రి బాలయ్య తన కొడుకు ఆచూకీ కోసం రెడ్డబోయిన భాస్కర్‌ను అడిగాడు. తనతోపాటు రాజు, విస్లావత్ సంగీరామ్ ముగ్గురం కలిసి కల్లు తాగడానికి వెళ్లినట్లు భాస్కర్ తెలిపాడు. కల్లు దుకాణం వద్ద విస్లావత్ సంగీరామ్, రాజుకు మధ్య గొడవ జరగడంతో రాజు అక్కడి నుంచి వెళ్లాపోయాడని వివరించాడు. దీంతో బాలయ్య తన తమ్ముడు కట్ట శ్రీనివాస్‌తో కలిసి రాజు కోసం వెతకగా ఆదివారం ఉదయం ఊరి చెడ్డి చెరువు వద్ద రాజు చెప్పులు, ఫోన్ కనిపించాయి. అనుమానంతో చెరువులోకి దిగి వెతకగా రాజు మృతదేహం లభ్యమైంది. తన కొడుకు మృతిపై అనుమానాలు ఉన్నాయంటూ రాజు తండ్రి కట్ల బాలయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి, ఇద్దరు అనుమానితులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సీఐ తిరుపయ్య తెలిపారు.

చుక్కాపూర్‌లో భక్తుల సందడి

చుక్కాపూర్ ఆలయంలో దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

మాచారెడ్డి, జనవరి 7 : మండలంలోని చుక్కాపూర్ అటవీ ప్రాంతంలో కొలువై ఉన్న శ్రీలక్ష్మీ నృసింహస్వామి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. జిల్లా నలుమూలలతోపాటు ఇతర జిల్లాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకొన్నారు. ఒడిబియ్యం,పట్టెనామాలు, కోరమీసాలు,కండ్లు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. నూతన వాహనాలకు ప్రత్యేక పూజలు చేయించారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ శనిగరం కమలాకర్‌రెడ్డి తెలిపారు.

మైసమ్మ ఆలయంలో పూజలు

నస్రుల్లాబాద్,జనవరి 7: మండలంలోని మైలారం గ్రామ శివారులో ఉన్న మైసమ్మ ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో వన భోజనాలు ఏర్పాటు చేసుకున్నారు.

వికసిత్ భారత్ సంకల్ప యాత్ర

ప్రభుత్వ కార్యక్రమాలపై అవగాహన కల్పిస్తున్న వైద్యసిబ్బంది

నస్రుల్లాబాద్, జనవరి 7: బీర్కూర్ మండలంలోని బరంగేడ్గి గ్రామంలో ఆదివారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల పై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నోడల్ అధికారి రోహిత్, ఆరోగ్య సిబ్బంది కావ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.



హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నేతృత్వంలో ఆదివారం జహీరాబాద్ పార్లమెంట్ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు పోచారం సురేందర్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి, పార్టీ నాయకులు హాజరయ్యారు.

-బాన్సువాడ, జనవరి 7

తెల్లబోయిన పత్తి రైతు

- దిగుబడి రాక.. మద్దతు ధర లేక..
- అనుకూలించని వాతావరణం
- వేధిస్తున్న కూలీల కొరత
- ఆందోళన చెందుతున్న రైతులు

లింబూర్ శివారులో సాగవుతున్న పత్తి పంట

డోంగ్లీ, జనవరి 7: మండలంలో నీటి వనరులు తక్కువగా ఉన్నాయి. దీంతో చాలా మంది రైతులు వర్షాధార పంటలను సాగుచేస్తారు. ఆరుతడి పంటల సాగుకు కూడా ప్రాధాన్యత ఇస్తారు. మండలంలో వానకాలం సీజన్‌లో చాలా మంది రైతులు పత్తిని సాగుచేశారు. మండల వ్యాప్తంగా 340 ఎకరాల్లో పత్తి పంట వేశారు. వాతావరణం అనుకూలించకపోవడంతో దిగుబడి గణనీయంగా తగ్గింది. ప్రస్తుతం పంటకు పెట్టిన పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. పంట చేతికి వచ్చినా.. కూలీల కొరత వేధిస్తున్నదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వానకాలం సీజన్ ప్రారంభంలో వర్షాలు సరిగా కురియకపోవడంతో పంట సాగుచేయడం కొంత ఆలస్యమైంది. అడపాదడపా కురిసిన వర్షాలకు వేసిన పత్తి విత్తనం మొలకెత్తినా.. అనంతరం వర్షాలు సరిగా కురియకపోవడంతో మొక్క సరిగా ఎదగ లేదు. దీంతో పూత, ఖాతా బాగా లేక దిగుబడి చాలా తగ్గిందని రైతులు అంటున్నారు. పండిన పంటకు కూడా ధర సరిగా లేకపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం సీసీఐలో క్వింటాలుకు రూ.7020 చెల్లిస్తుండగా.. ప్రైవేటు వ్యాపారులు రూ.6,300 నుంచి 6,300వరకు చెలిస్తున్నారు. దీంతో గిట్టుబాటు కావడం లేదని రైతులు అంటున్నారు.

కూలీలు లేక ఇబ్బందులు..

సీజన్ పూర్తవుతున్నా.. పంటను తీయడానికి కూలీలు లభించక రైతులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. హండేకేలూర్, మేనూర్ తదితర ప్రాంతాల నుంచి కూలీలను తీసుకొచ్చి పత్తిని ఏరుతున్నారు. పత్తి ఏరడానికి కిలోకు పది నుంచి రూ.12 వరకు తీసుకునేవారు. కొరత ఏర్పడడంతో ప్రస్తుతం రూ.15, 16వరకు తీసుకుంటున్నారని, అయినా కూలీలు దొరకడం లేదని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. వేల రూపాయల పెట్టుబడి పెట్టి పండించిన పంట ఇంటికి చేరడానికి కూడా అన్నదాతకు కష్టాలు తప్పడం లేదు.

పంట దిగుబడి తగ్గింది..

ప్రతి సంవత్సరం మూడు ఎకరాల వరకు పత్తి పంట వేస్తా. ఈసారి రెండు ఎకరాల్లో సాగుచేశా. సరైన సమయంలో వానలు పడకపోవడంతో దిగుబడి బాగా తగ్గింది. మార్కెట్‌లో ధర తక్కువగా ఉండడంతో ఆరు నెలలు పడిన కష్టానికి గిట్టుబాటు కూడా కావడం లేదు. చేనులో మిగిలిన పత్తి ఏరడానికి కూలీలు దొరకడం లేదు. ప్రభుత్వం పత్తికి మద్దతు ధరను మరింత పెంచితే రైతులకు మేలు జరుగుతది.

- గణేశ్ మేంగే, యువ రైతు, డోంగ్లీ

విండోలకు తాటిపత్రులను అందజేస్తాం

వివరాలను వెల్లడిస్తున్న ఏఎంసీ చైర్మన్

సదాశివనగర్, జనవరి 7: సదాశివనగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో ఎనిమిది ప్రాథమిక సహకార సంఘాలకు త్వరలో వంద తాటిపత్రులను అందజేస్తామని సదాశివనగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పుల్గం సాయిరెడ్డి అన్నారు. సదాశివనగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు.. ఏఎంసీ పరిధిలోని ఆయా ప్రాథమిక సహకార సంఘాల్లో ఉన్న రైతుల కోసం తాటిపత్రులను సరఫరా చేస్తామని చెప్పారు. వారం రోజుల్లో వాటిని సమకూరుస్తామని తెలిపారు. సదాశివనగర్ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో పద్మాజివాడి ఎక్స్ రోడ్డు, తాడ్వాయిలో చెక్‌పోస్టులను ఏర్పాటు చేశామని చెప్పారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ట్యాక్స్ వసూలు చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో ఏఎంసీ కార్యదర్శి గంగు, సూపర్‌వైజర్ నామాల లక్ష్మీనర్సయ్య, వైస్ చైర్మన్ వడ్ల రాజేందర్, డైరెక్టర్లు పాల్గొన్నారు.

సంక్రాంతి క్రికెట్ టోర్నీ ప్రారంభం

టోర్నీని ప్రారంభిస్తున్న ఎంపీటీసీ రాజులు

గాంధారి, జనవరి 7: సంక్రాంతి పండుగను పురస్కరించుకొని మండల కేంద్రంలోని గురుకుల పాఠశాల మైదానంలో క్రికెట్ పోటీలను ఎంపీటీసీ తూర్పు రాజులు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోటీలను ప్రశాంత వాతావరణంలో, క్రీడా స్ఫూర్తితో నిర్వహించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రావు సాహేబ్‌రావు, సందీప్, నాగభూషణం, రమేశ్, సజన్‌రాజ్, కళ్యాణ్, సంతోష్ గౌడ్, ఆకుల నవీన్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

పిట్లం, జనవరి 7: మండలంలోని పిట్లం – బాన్సువాడ ప్రధాన రహదారిపై పిట్లం పోలీసులు ఆదివారం వాహనాల తనిఖీ నిర్వహించారు. ఎస్సై విజయ్‌కొండ ఆదేశాల మేరకు వాహనాల తనిఖీ చేపడుతున్నామని హెడ్‌కానిస్టేబుల్ సాయాగౌడ్ తెలిపారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్‌ను తప్పనిసరిగా ధరించాలని, ఆటోలు, జీపులు నడిపేవారు పరిమితికి మించి ప్రయాణికులను తరలించొద్దన్నారు. రోడ్డు భద్రతా నిబంధనలు తప్పనిసరిగా పాటిస్తూ.. ప్రమదాల నివారణకు ప్రతి క్కరూ కృషి చేయాలని వాహనదారులకు సూచించారు. తనిఖీలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదంలో గుడిసె దగ్ధం

మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

గాంధారి, జనవరి 7: గాంధారిలో శనివారం అర్ధరాత్రి ప్రమాదవశాత్తు నివాసపు గుడిసె కాలిపోయింది. ఎస్సీ కాలనీలో బస రాములు, బస పోచయ్య కుటుంబాలు నివసిస్తున్నాయి. గుడిసెకు ప్రమాదవశాత్తు నిప్పు అంటుకోవడంతో స్థానికులు అగ్ని మాపక శకటానికి సమాచారం అందించారు. అప్పటికే గుడిసెలో ఉన్న వంటసామగ్రితోపాటు, కౌలు భూమిలో పండించిన 10 క్వింటాళ్ల పత్తి, ఎడ్ల బండి, తిండి గింజలు కాలిబూడిదయ్యాయి. ప్రమాదంలో సుమారు రెండు లక్షల రూపాయల నష్టం వాటిల్లిందని రెవెన్యూ అధికారులు తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

గాంధారి, జనవరి 7: మండలంలోని పలు తండాలకు చెందిన ప్రజాప్రతినిధులు ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌ను హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. తండాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతిపత్రాన్ని అందజేశారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో గుజ్జుల్‌తండా సర్పంచ్ దేవీసింగ్, దుర్గం గ్రామ ఉపసర్పంచ్ సకారాం తదితరులు ఉన్నారు.

బిచ్కుందలో ముగ్గుల పోటీ

బహుమతిని అందజేస్తున్న నిర్వాహకులు, నాయకులు

బిచ్కుంద, జనవరి 7: మండల కేంద్రంలో భూమి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ముగ్గుల పోటీని నిర్వహించారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకొని నిర్వహించిన ఈ పోటీలో మహిళలు, యువతులు, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీలో విజేతలుగా నిలిచిన వారికి సీనియర్ నాయకులు మల్లికార్జునప్ప, డాక్టర్ విక్రం బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో బండాయప్ప, స్వరూప, గిరిజ, లావణ్య, భూమి స్వచ్ఛంద సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

బాధితురాలికి సహాయం అందజేత

ఆర్థిక సహాయం అందజేస్తున్న లయన్స్ బాధ్యులు

పిట్లం, జనవరి 7: చిన్నకొడప్‌గల్ గ్రామంలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో వడ్ల లక్ష్మి ఇల్లు కాలిపోయింది. దీంతో పిట్లం లయన్స్ క్లబ్ సభ్యులు బాధిత కుటుంబానికి ఆదివారం రూ. ఐదు వేల నగదు, నిత్యావసర సరుకులను అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ పిట్లం అధ్యక్షుడు కిషన్, సభ్యులు కొంతం రాజు, కాశీరెడ్డి, వేణుగోపాల్, నారాయణరెడ్డి, రమణా గౌడ్, లక్ష్మీనారాయణ, చంద్రశేఖర్, సంతోష్ పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్
WANTED
★ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9640400073/9160900024.
NT-319407-All
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే, ఇతర అదనపు లైనుకు 50/- మాత్రమే
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

బుగ్గ రామలింగేశ్వర స్వామిని దర్శించుకున్న సీనియర్ సివిల్ జడ్జి

రామారెడ్డి, జనవరి7: మండలంలోని మద్దికుంట గ్రామంలో వెలిసిన బుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయాన్ని కామారెడ్డి సీనియర్ సివిల్ జడ్జి నాగరాణి ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పూజారులు ఆమెకు తీర్థ ప్రసాదాలు, స్వామి వారి చిత్ర పటాన్ని అందజేసి, శాలువా కప్పి సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ పూజారి గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

కామారెడ్డి సీనియర్ సివిల్ జడ్జి నాగరాణిని సన్మానిస్తున్న ఆలయ పూజారి

సన్నాహక సమావేశానికి తరలిన బీఆర్ఎస్ శ్రేణులు

తెలంగాణ భవన్ వద్ద బీఆర్ఎస్ బిచ్కుంద మండల నాయకులు, సమావేశంలో నిజాంసాగర్, మహ్మద్‌నగర్ మండల నేతలు

నిజాంసాగర్/ బిచ్కుంద, జనవరి 7: జహీరాబాద్ పార్లమెంట్ స్థాయి బీఆర్ఎస్ పార్టీ సన్నాహక సమావేశాన్ని హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆదివారం నిర్వహించారు. సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, హరీశ్‌రావుతోపాటు జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్, జహీరాబాద్ నియోజకవర్గం పరిధిలోని ఆయా అసెంబ్లీ నియోజకవర్గాల పార్టీ ఇన్‌చార్జిలు, మాజీ ఎమ్మెల్యేలు హాజరయ్యారు. మాజీ ఎమ్మెల్యే హన్మంత్‌షిండే, జడ్పీ చైర్‌పర్సన్ దఫేదార్ శోభ, జడ్పీ మాజీ చైర్మన్ రాజు పాల్గొన్నారు. నిజాంసాగర్, మహ్మద్‌నగర్ మండలాల నుంచి నాయకులు దుర్గారెడ్డి, గంగారెడ్డి, సత్యనారాయణ, మనోహర్, వాజిద్‌అలీ, నర్సింహారెడ్డి, విఠల్‌రెడ్డి, చందర్, రాజు తరలివెళ్లారు. బిచ్కుంద నుంచి తరలివెళ్లిన వారిలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నాల్చార్ రాజు, ఎంపీపీ అశోక్ పటేల్, మార్కెట్ కమిటీ చైర్మన్ నాగ్‌నాథ్ పటేల్, రైతుబంధు సమితి మండల కన్వీనర్ బస్వరాజ్ పటేల్, మైనార్టీ నాయకులు అసద్‌అలీ, కలీం పటేల్ తదితరులు పాల్గొన్నారు.